క్లుప్తంగా

ప్రత్యేక నిధులతో ఫంక్షన్ హాల్ పనులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన సుల్తానా అల్వా కాలనీవాసులు

చంపాపేట: చంపాపేట డివిజన్ సుల్తానాఅల్వా కాలనీలోని అసంపూర్తి దశలో ఉన్న మల్టీ పర్పస్ మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు ప్రత్యేక నిధులతో త్వరలో ప్రారంభిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు సుధీర్‌రెడ్డిని కలసి ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, నాయకులు బైగళ్ల రాము, ప్రభాకర్, సత్యనారాణ, సురేష్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘మెగాసిటీ’ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని మెగాసిటీ పాఠశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి వేడుకలను ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. పాఠశాల చైర్మన్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, పండాల శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ క్రాంతి యువజన సంఘం ఆవరణలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఇటీవల రూ. 71 లక్షలను మంజూరు చేశారు. దీంతో డివిజన్ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందొరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం క్రాంతి యువజన సంఘం నాయకులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసి శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు కొంగర మహేష్, భిక్షపతి, నర్సింహ, మానయ్య, పారంద నర్సింహ, రమేష్, లక్ష్మయ్య, యాదగిరి, మల్లేష్, దర్శన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్: రైలు ఢీకొని బెంగుళూరు వాసి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఆదివారం ఉదయం మలక్‌పేట రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు బెంగుళూరుకు చెందిన పార్థసారథిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



అదృశ్యమైన సుష్మిత

హస్తినాపురం: కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి సరుకులు కొనేందుకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఒరిస్సా రాష్ట్రం నాపాడబడి పాడి ప్రాంతానికి చెందిన అంజనా సబర్ తన కుటుంబంతో బతుకుదెరువు కోసం 3 సంవత్సరాల క్రితం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం తుర్కయాంజాల్‌లోని వీరమని బిస్కట్ కంపెనీలో కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15న సరుకులు కొనేందుకు వనస్థలిపురం రైతుబజార్ దగ్గరకు అంజనా సబర్ తన చిన్నకూతురు సుష్మితా సబర్‌తో కలిసి వచ్చారు. సరుకులు కొనుగోలు చేస్తుండగా సుష్మితా సబర్(19) కనిపించకుండా పోయింది. దీంతో కంగారు చెందిన అంజనా తన కూతురు సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కూతురు ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కూతురుతోపాటు బిస్కెట్ కంపెనీలో పని చేస్తున్న శివ అనే యువకుడు కూడా కనిపించడంలేదని శివపైనే అనుమానం ఉందని అంజనా ఫిర్యాదులో పేర్కొంది.

కొండెక్కిన కూరగాయలు!

- సెంచరీకి చేరువగా కూరగాయల ధరలు
- కొనలేకపోతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం
- ప్రజలకు సరిపడా సరఫరా లేనందునే డిమాండ్
- తక్కువ ధరకు రెండు.. మూడు రకాల కూరగాయలే...



వనస్థలిపురం రైతుబజార్

వనస్థలిపురం: మండుతున్న కూరగాయల ధరలు వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. అంతకంతకూ ధరలు పెరుగుతూ నింగిని అంటుతుండటంతో సామాన్య ప్రజలు కొనలేక గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ. 200 పెడితే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవని, ప్రస్తుతం రూ. 500 పెట్టినా రావడం లేదని పలువురు వాపోతున్నారు. నాన్‌వెజ్‌లకు దీటుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయని, ఇక కూరలు వండుకునేది ఎట్లా తినేది ఎట్లా అని వారు దిగాలు పడుతున్నారు.

- ప్రస్తుతం రైతుబజార్లలో ఒకటి, రెండు రకాలు తప్ప అన్ని రకాల కూరగాయల ధరలు రూ. 50 సమీపంలో, మరికొన్ని సెంచరీకి చేరువలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో రూ. 20, రూ. 30 పెడితే కిలో వచ్చే కూరగాయలు ఇపుడు రూ. 50 నుంచి రూ. 75 ధరల్లో లభ్యం అవుతున్నాయి. ఇంతకుముందు కిలో కొన్నచోట ప్రస్తుతం అరకిలో కొని సరిపెట్టుకోవాల్సి వస్తోందని గృహస్తులు వాపోతున్నారు.
- ఆకుకూరలు సైతం గతంలో రూ. 10కి 5, 6 కట్టలు వచ్చేవి. ప్రస్తుతం రూ. 20 పెట్టి కొనాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుబజార్లలోనే ధరలిలా ఉండగా బహిరంగ మార్కెట్లలో పరిస్థితి కిలోకు రూ. 10 నుంచి రూ. 20 అదనంగా ఉందని గృహస్తులు వాపోతున్నారు. కిలో కొనేచోట అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

కూరగాయల ధరలిలా...

- సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 13, వంకాయ 28, బెండ 55, పచ్చి మిర్చి 40, కాకర 32, బీర 45, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 20, దొండ 23–28, చిక్కుడు 50, గోకర 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 45, ఆలు 22, దోస 28, సొర 11, పొట్ల 10, ఉల్లి 19, చామగడ్డ రూ. 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కొనేట్టు లేదు...



కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. సామాన్యులు కొనే పరిస్థితి లేదు. గతంలో రూ. 200 పెడితే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. నేడు రూ. 500 నుంచి 600 పెడితే తప్ప వారానికి సరిపడా రావడం లేదు. బహిరంగ మార్కెట్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. రూ. 100కు చేరువ అవుతున్నాయి.

– గణపురం కృష్ణ, వనస్థలిపురం

దిగుబడి తగ్గినందునే...



గతంలో భారీ వర్షాలు, ప్రస్తుతం చలికాలం అధిక తేమ వల్ల కూరగాయల దిగుబడి తగ్గింది. దీంతో ధరలు తగ్గడం లేదు. గతంలో వనస్థలిపురం రైతుబజార్‌కు రోజు 400 నుంచి 450 క్వింటాళ్ల వరకు కూరగాయలు వస్తుండగా ప్రస్తుతం 300 నుంచి 350 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. కొత్త పంట వస్తుండటంతో ధరలు తగ్గనున్నాయి.

– స్వప్న, ఈవో, రైతుబజార్, వనస్థలిపురం

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- దుష్ప్రచారాలను నమ్మొద్దు
- ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తాం
- మార్నింగ్‌వాక్‌లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నానని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బాలాజీనగర్, లెక్చరర్స్ కాలనీ, త్యాగరాయనగర్, కేవీఎస్‌రెడ్డినగర్, ఆదిత్యానగర్, శ్రీరాంనగర్, లక్ష్మీభవానీనగర్, ఎల్లారెడ్డికాలనీ, సిరిహిల్స్, రాజరాజేశ్వరీకాలనీ, శివగంగా కాలనీ, స్వాతీరెసిడెన్సీ, అంజలీ రెసిడెన్సీ, పవనగిరికాలనీ మీదుగా వీరన్నగుట్టవరకు ఆదివారం తెల్లవారుజామును ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ చేపట్టారు. ఆయాకాలనీవాసులు ఎమ్మెల్యేకు కాలనీ సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీలోని ప్రధాన రోడ్లపై మంచినీటి, డ్రైనేజీ వ్యవస్థ అనంతరం సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేసి కాలనీ అంతర్గత రోడ్లు పూర్తి చేయటం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో సుమారు 68 కిలోమీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్ పనులు, సుమారు 55 కాలనీలలో పనులు చేపడుతామని వివరించారు. రోజు 300 మీటర్ల మేర తాగునీటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

- వరదనీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా క్రీడా ప్రక్కనుంచి బాక్స్‌టైప్ నాలాను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంచినీటి పైపులైన్స్‌కు, డ్రైనేజీ పైపులైన్స్‌కు ఒక మీటరు దూరం స్థలం వదిలేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాని, ఎలాంటి దుష్ప్రచారం చేసేలా వ్యాఖ్యలను నమ్మవద్దని కాలనీవాసులకు సూచించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలీ జీఎం వినోద్ కుమార్, మేనేజర్ రాజు, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మహిళాధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, కేకేఎల్‌గౌడ్, కొసనం వెంకటరెడ్డి, పారంద నర్సింగ్, అనిల్, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వివరిస్తున్న కాలనీసంక్షేమ సంఘాల ప్రతినిధులు

ప్రొటోకాల్ పాటించకుండా శంకుస్థాపనలా?

హయత్‌నగర్ కార్పొరేటర్‌పై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం

హయత్‌నగర్: హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నారని, కార్పొరేటర్ తన తీరును మార్చుకోకపోతే డివిజన్‌లో తిరగనివ్వమని హయత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం మాజీ కార్పొరేటర్ సామ తిరమల్‌రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎమ్మెల్యే ఎంతో కష్టపడి డ్రైనేజీ నిర్మాణానికి నిధులు తీసుకొస్తే పనుల పరిశీలిస్తానని వెళ్లిన కార్పొరేటర్ ఏకపక్షంగా శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. ప్రొటోకాల్‌పై గగ్గోలు పెట్టే బీజేపీ నాయకులు తాము మాత్రం ప్రొటోకాల్ పాటించకుండా నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారని, మరోసారి ఇలా జరిగితే సహించేది లేదన్నారు. రెండేళ్లలో కార్పొరేటర్ డివిజన్‌లోని ఎలాంటి సమస్యను పరిష్కరించలేదని, అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు తేలేదని ఆరోపించారు. పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి యానాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, అంజలిగౌడ్, సత్తిరెడ్డి, అంజమ్మ, సైకలాబ్, గంగని నాగేష్, మధుమదిరాజ్, గోవర్ధన్, బాలూ నాయక్, రాజునాయక్, భాస్కర్‌గుప్తా, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

మ్యాన్‌హోల్స్.. డేంజర్ బెల్స్!

మరమ్మతులు చేపట్టాలంటున్న కాలనీల ప్రజలు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ చింతలకుంట చెక్ పోస్ట్ నుంచి సాగర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీ పైప్‌లైన్‌కు సంబంధించిన పలు మ్యాన్‌హోల్‌లు వాహనాల తాకిడికి పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని శ్రీకృష్ణానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుట్ల నరసింహ యాదవ్ ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తే జలమండలి పేరు చెపుతున్నారని, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే ఫ్లైఓవర్ నిర్మిస్తున్న ఎస్ఆర్‌డీపీ అధికారుల పేరు చెపుతున్నారని ఆయన పేర్కొన్నారు. మ్యాన్‌హోల్‌లు ప్రమాదకరంగా మారడంతో ట్రాఫిక్ పోలీసులు సిమెంట్ దిమ్మెలను అడ్డుగా పెడుతున్నారని. ఆ దిమ్మెలు కూడా పైప్‌లైనులో పడిపోతూ డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



చింతలకుంట-సాగర్ రింగ్‌రోడ్డు దారిలో ధ్వంసమైన మ్యాన్‌హోల్

పేకాట రాయుళ్లపై ఉక్కుపాదం

హయత్‌నగర్: ఎకో టూరిజం పార్కులోని ఓ రిసార్టులో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై హయత్‌నగర్ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఆటోనగర్ సమీపంలోని ఎకో టూరిజం పార్కులోని అనన్య రిసార్టులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి 11 గంటల సమయంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. మొత్తం 11 మంది పేకాట ఆడుతుండగా ఇద్దరు తప్పించుకున్నారు. మిగిలిన 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ. 3,67,140తో పాటు 8 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఓల్డ్‌మలక్‌పేట పరిధిలో...

చాదర్‌ఘాట్: పేకాట నిర్వహిస్తున్న ఓ ఇంటిపై దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడ పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2,10,250లను స్వాధీనం చేసుకున్నారు. చాదర్‌ఘాట్ ఎస్‌ఐ పాండు సమాచారం మేరకు... ఓల్డ్‌మలక్‌పేట ప్రిన్స్ బాడీగార్డ్ కాలనీలో నివసించే మహ్మద్ ఖలీల్ తన ఇంటిలోనే కొంతకాలంగా పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం తెల్లవారుఝమున పేకాట నిర్వహిస్తున్న ఖలీల్ గృహంపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 15 మందిని అరెస్ట్ చేసి నగదుతోపాటు నాలుగు పేకాట సెట్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం వారిని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు.

నిరుపేద కుటుంబాలకు చేయూత

మన్సూరాబాద్: కరోనా సమయంలో పేదలు పస్తులు ఉండవద్దనే ఆలోచనలో రైస్ ఎటీఎంను ఏర్పాటు చేశామని, వచ్చినవారే తిరిగి రావటాన్ని గమనించి ప్రాజెక్టు ప్రిషాకు రూపకల్పన చేశామని రైస్ ఎటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము, ప్రాజెక్టు ప్రిషా కన్వీనర్ యశస్విని జొన్నలగడ్డ తెలిపారు. ప్రాజెక్టు ప్రిషా ఏర్పడి రెండు వసంతాలు పూర్తయిన సందర్భంగా రైస్ ఎటీఎం వద్ద 10 మంది నిరుపేదలకు తోపుడు బండ్లు, టీ పాయింట్, కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెండేళ్ల కాలంలో సుమారు 1836 మంది నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించామన్నారు.



తోపుడుబండ్లు, కుట్టుమిషన్లు, టీపాయింట్ డబ్బాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

వనస్థలిపురం: కాలనీలలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం వనస్థలిపురం ఫేజ్–2 హుడా కాలనీ ఏ–టైపు క్వార్టర్స్‌లో కాలనీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, క్లావ్ డెంటల్ ఆస్పత్రుల వైద్యులు శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జి.ఆనంద్ రాజ్, కార్యదర్శి సతీష్‌కుమార్, ఆలయ అధ్యక్షుడు రాములు, కార్యదర్శి శ్రీనివాస రావు, ఎస్‌ఐ మాధవరెడ్డి, నాయకులు చింతల రవికుమార్, లత ఆనంద్‌రాజ్, సంజయ్, మధుగౌడ్, కిషోర్ పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే ఆయువుపట్టు



మాట్లాడుతున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: బీజేపీకి కార్యకర్తలే ఆయువు పట్టు అని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి పార్టీ శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, పోలింగ్ బూత్‌ల అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ కార్యకర్తలు నిరంతరం కాలనీవాసులతో మమేకమై పార్టీని బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికలలో ఎల్‌బీనగర్‌లో బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ మహిళా విభాగం సభ్యులు శైలజ, సువర్ణ, శ్రీనిధి, నాయకులు యోగిరాజ్, శ్రీనివాస్, అంజి, రామాంజి, అవినాష్‌రెడ్డి, దశరథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయంలో రాంమోహన్‌గౌడ్ తదితరులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో సాహెబ్‌నగర్ బతుకమ్మ కుంటలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆలయా కమిటీ చైర్మన్ ముద్దగౌని చంద్రకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ ఇంచార్జ్ ముద్దగౌని రాంమోహన్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాంమోహన్‌గౌడ్‌ని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పంగ శ్యాంకుమార్‌గౌడ్, వెంకట్‌స్వామి యాదవ్, అశోక్‌సింగ్, లక్ష్మయ్య గౌడ్, నాగరాజుగౌడ్, కాశీనాథ్, యాదిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

- త్వరలో డ్రైనేజీ సమస్యలూ పరిష్కరిస్తా
- కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్యను పరిష్కరించామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ హయత్‌నగర్ పరిధి ఎల్లారెడ్డికాలనీ, లక్ష్మీభవానీనగర్‌కాలనీలో ఆదివారం మార్నింగ్ వాక్ చేపట్టి కాలనీలలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించానని, త్వరలోనే డ్రైనేజీ పనులను పూర్తిచేయిస్తానని తెలిపారు. వరదతో శివారు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. హతిగూడ చెరువు కబ్జా అవుతోందని ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని, హతిగూడ చెరువును అభివృద్ధి చేసి బాలాజీనగర్ నుంచి వరద నీరు చెరువులోని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. డ్రైనేజీ ట్రంక్‌లైన్‌ను కుంట్లూరు గ్రామం వరకు కలిపే పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కాలనీల నేతలు శ్రీనివాస్, నవీన్‌రావు, యాసిన్, వెంకట్ రెడ్డి, రమేష్, వెంకటచారి, జనార్దన్, దిలీప్‌రెడ్డి, గోవింద ఆచార్య, కడారి యాదగిరియాదవ్, నవీన్ గుప్తా, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీభవానీనగర్‌కాలనీలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: విపత్కర సమయాల్లోనూ ప్రజారోగ్యం కోసం విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి జీఏ–2 కాలనీలో పర్యటించారు. అనంతరం సైదాబాద్ డివిజన్‌లో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలు, బస్తీలవాసులు తమ ఇంటి ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తమ ప్రాంతాల్లో విధులు నిర్వహించే కార్మికులకు పారిశుద్ధ్యం విషయంలో సహకరించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమురళి, రాజేశ్వరరావు, రమణమూర్తి, వై.ఎస్.ఎన్.మూర్తి, రామరాజు, వెంకట్ కులకర్ణి, ఈసీ నీరజ, మంజుల, వనజ, సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలి

హయత్‌నగర్: పెరుగుతున్న టెక్నాలజీతో యువతలో క్రీడల పట్ల ఆసక్తి తగ్గిపోయి బద్ధకం పెరుగుతోందని దీంతో యువత చిన్నతనంలోనే రోగాల బారిన పడుతున్నారని, విద్యార్థి దశ నుంచే వారికి క్రీడల పట్ల ఆసక్తిని పెంచాలని ఎల్‌బీనగర ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్, ఆర్ఆర్ ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్కూల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు ఆడుకునేందుకు ప్రతి పాఠశాలలో మైదానాలను అభివృద్ధి చేయాలన్నారు. చదువుతో పాటు ఆటలలోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఏసీపీ శేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తిరుమల్‌రెడ్డి, భాస్కర్‌సాగర్, గుడాల మల్లేష్, ప్రిన్సిపాల్ లీల, నిర్వాహకులు ఇర్ఫాన్‌పాషా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్ పవన్‌కుమార్



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. న్యూనాగోల్‌లో ఆదివారం ఆయన కలసి పర్యటించారు. స్థానికులు కాలనీలలో నల్లా కనెక్షన్లు లేక నీటి కోసం ఇబ్బందులు, డ్రైనేజీ ఇతర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి మంచి నీటి కనెక్షన్‌లు ఇవ్వాలని కోరారు. న్యూ నాగోలు సీనియర్ సిటిజన్ భవన్‌లో నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్యారమ్స్ పోటీల విన్నర్స్‌కు బహుమతులను ప్రదానం చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జ్ఞానకుమార్‌గౌడ్, నేతలు రవీందర్, ఇందిరాశర్మ, ప్రకాష్, శ్రీశైలం పాల్గొన్నారు.